RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..



రాజకీయ పార్టీలకు

**జెన్-జీ భయం!**

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | గురువారం, అక్టోబరు 22, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 165 | పేజీలు: 8 | వెల : రూ.1

# సమాజ రక్షణ కోసం పోలీసుల ప్రాణత్యాగం

**పోలీసు శాఖలో మరో 5 వేల పోస్టుల భర్తీ..**
**హోంగార్డుల ఎక్స్‌గ్రేషియా రూ.10 లక్షలకు పెంపు**

**పోలీసు అమరవీరుల సంస్మరణ**
**దినోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన**




హైదరాబాద్, అక్టోబర్ 21 (వాయిస్ టుడే): సమాజ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చేస్తున్న ప్రాణత్యాగాలు వెలకట్టలేనివని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరచిపోదని పేర్కొన్నారు. అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోలీసు శాఖలో మరో 5 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని, 2028 నాటికి అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌లోని గోషామహల్ పోలీస్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. దేవ్ సింగ్, ప్రమోద్ కుమార్, గాజుల సౌమ్య తదితర పోలీసు అమరుల సేవలను స్మరించుకున్నారు. వారి త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతలు పునాదులని, అందుకే తమ ప్రభుత్వం పోలీసు శాఖకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించామని, ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించి వారికి ఆత్మగౌరవంతో కూడిన ఉపాధి అవకాశాలు కల్పించామని వివరించారు.

### అమరుల కుటుంబాలకు భారీగా ఆర్థిక సాయం

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయే పోలీసు సిబ్బంది కుటుంబాలకు అందించే ఎక్స్‌గ్రేషియాను గణనీయంగా పెంచినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు రూ.1 కోటి, ఎస్ఐలకు రూ.45 లక్షలు, ఇన్‌స్పెక్టర్లకు రూ.1.25 కోట్లు, డీఎస్పీ, అదనపు ఎస్పీలకు రూ.1.50 కోట్లు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రూ.2 కోట్ల వరకు ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు వివరించారు. అలాగే విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయే హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశించినట్లు తెలిపారు. ఇది కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని, అమరవీరుల కుటుంబాల పట్ల ప్రభుత్వం చూపిస్తున్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు.

### పోలీసు పిల్లలకు నాణ్యమైన విద్య

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని సీఎం తెలిపారు. హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి అధికారుల పిల్లల విద్య కోసం 'యంగ్ ఇండియా పోలీస్ స్కూల్' ప్రారంభించినట్లు చెప్పారు. అమరుల కుటుంబాలకు నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు, నివాస స్థలాలు, పిల్లలకు ఉచిత విద్య, వైద్య సదుపాయాలు, బస్‌పాస్‌లు కల్పించనున్నట్లు వెల్లడించారు. పిల్లలకు వైద్య విద్యలో ప్రత్యేక రిజర్వేషన్లు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు.

### డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ బృందానికి ప్రశంసలు

మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ పోలీసు శాఖ

(మిగతా 2వ పేజీలో)

# మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం రేవంత్

## చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు..
## జంబూ సవారిని వీక్షించిన తెలంగాణ ముఖ్యమంత్రి



మైసూరు, అక్టోబర్ 21 (వాయిస్ టుడే): కర్ణాటక రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ప్రపంచ ప్రసిద్ధ మైసూరు దసరా ఉత్సవాల్లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు మైసూరుకు చేరుకున్న ఆయనకు ఉత్సవాల నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దసరా వేడుకల్లో భాగంగా నిర్వహించిన చారిత్రక జంబూ సవారిని ముఖ్యమంత్రి ఆసక్తిగా వీక్షించారు. జంబూ సవారిలో ప్రత్యేకంగా అలంకరించిన ఏనుగుపై బంగారు అంబారీలో కొలువుదీరిన చాముండేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తిని రేవంత్ రెడ్డి దర్శించుకుని భక్తిశ్రద్ధలతో నమస్కరించారు. మైసూరు దసరా ఉత్సవాల్లో జంబూ సవారి అత్యంత ప్రధానమైన ఘట్టం. మైసూరు రాజవంశీయుల కాలం నుంచి కొనసాగుతున్న ఈ సంప్రదాయం కర్ణాటక చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ ఊరేగింపులో కన్నడ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళాకారులు, సంప్రదాయ సంగీత బృందాలు, నృత్య కళాకారులు, వివిధ ప్రాంతాల సాంస్కృతిక బృందాలు పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రంగురంగుల వేషధారణలు, సంప్రదాయ వాయిద్యాల నడుమ సాగిన కళా ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దేశ, విదేశాల నుంచి తరలివచ్చిన వేలాది మంది ప్రజలు ఈ వేడుకలను తిలకించారు.

అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైసూరు ప్రజల ఆరాధ్య దైవమైన చాముండేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం మైసూరు రాజభవనం పరిసరాల్లో నిర్వహించిన దసరా వేడుకల్లో పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో పాటు పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, దేశ, విదేశాలకు చెందిన అతిథులతో కలిసి రేవంత్ రెడ్డి ఉత్సవాలను వీక్షించారు. వివిధ రాష్ట్రాల సంస్కృతులు, సంప్రదాయాలు, కళారూపాలను ఒకే వేదికపై ప్రతిబింబించే ఇటువంటి ఉత్సవాలు భారతీయ ఐక్యత, సాంస్కృతిక వైవిధ్యానికి నిదర్శనంగా నిలుస్తాయి.



వాయిస్ ఆఫ్ ప్రజలు

గురువారం, అక్టోబరు 22, 2026

# రాజకీయ పార్టీలకు జెన్-జీ భయం!

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువ ఓటర్లే కీలకం

## నిరుద్యోగం, ఉద్యోగాల భర్తీపై అసంతృప్తి ప్రభావం ఎంత?

## రేవంత్ సర్కార్‌కు అసలు సిసలు అగ్నిపరీక్ష

## ఐదు పార్టీల మధ్య ఆసక్తికర పోరు



హైదరాబాద్, అక్టోబర్ 21 (వాయిస్ టుడే): తెలంగాణలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయ పార్టీల్లో కొత్త ఆందోళనకు తెరలేపుతున్నాయి. ముఖ్యంగా జెన్–జీ యువత ఎవరికి మద్దతుగా నిలుస్తారన్నది ప్రధాన పార్టీలకు అంతుచిక్కడం లేదు. నిరుద్యోగం, ఉద్యోగ నోటిఫికేషన్లు, నియామకాల జాప్యం వంటి సమస్యలపై యువతలో ఉన్న అసంతృప్తి ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశ ముందని రాజకీయ పార్టీలు అంచనా వేస్తున్నాయి. దీంతో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, జనసేన, తెలంగాణ రక్షణ సేన పార్టీలు యువ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రత్యేక వ్యూహాలు రచిస్తున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొత్తగా పట్టభద్రులైన యువత ఓట్లు కీలకంగా మారనున్నాయి. ఈసారి పెద్ద సంఖ్యలో కొత్త ఓటర్లు చేరే అవకాశం ఉండటంతో వారి మద్దతు ఎటువైపు ఉంటుందన్నది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. నిరుద్యోగం, ఉద్యోగ నోటిఫికేషన్లు, నియామకాల జాప్యం, విద్యావ్యవస్థలో సమస్యలు ప్రధాన చర్చనీయాంశాలుగా మారుతున్నాయి. యువత ఆకాంక్షలను గుర్తించి వారి నమ్మకాన్ని పొందిన పార్టీకే ఎన్నికల్లో ఆధిక్యం దక్కే అవకాశముంది.

**రేవంత్ సర్కార్‌కు అగ్నిపరీక్ష!**

అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనపై విద్యావంతులు, పట్టభద్రుల అభిప్రాయాన్ని అంచనా వేసేందుకు ఈ ఎన్నికలు లిట్మస్ టెస్ట్‌గా మారనున్నాయి. రెండు పట్టభద్రుల నియోజకవర్గాల పరిధిలో సుమారు 77 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండటంతో కాంగ్రెస్‌కు ఈ పోరు కీలకంగా మారింది. విజయం సాధిస్తే ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత ఉందని చెప్పుకునే అవకాశం ఉంటుంది. ప్రతికూల ఫలితాలు వస్తే బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేకతగా ప్రచారం చేసే అవకాశముంది. కాంగ్రెస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో ముందంజ వేసింది. మహబూబ్‌నగర్––రంగారెడ్డి––హైదరాబాద్ స్థానం నుంచి సామ రామమోహన్ రెడ్డిని, వరంగల్––ఖమ్మం––నల్గొండ స్థానం నుంచి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని బరిలోకి దింపింది. ముఖ్యమంత్రి సొంత జిల్లా మహబూబ్‌నగర్ ఈ ఎన్నికల పరిధిలో ఉండటంతో ఆ స్థానంపై రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

**బీఆర్ఎస్‌కు గత పాలన ప్రభావం!**

మరోవైపు బీఆర్ఎస్ కూడా ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంబంధిత జిల్లాల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. గత పదేళ్ల పాలనలో యువతకు కల్పించిన అవకాశాలు, ఉద్యోగాల భర్తీ అంశాలను తమకు అనుకూలంగా మలుచుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అయితే గత పాలనపై యువత అభిప్రాయం ఎలా ఉంటుందన్నది ఆ పార్టీకి సవాలుగా మారింది. ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రయత్నిస్తోంది.

**బీజేపీకి యువత మద్దతుపై ఆశలు!**

గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో విజయాలు సాధించిన బీజేపీ కూడా తన పట్టును నిలుపుకోవాలని చూస్తోంది. కేంద్ర ప్రభుత్వ విధానాలు, యువతకు ఉపాధి అవకాశాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రచార అస్త్రాలుగా మలుచుకోవాలని భావిస్తోంది. దేశవ్యాప్తంగా యువతలో పెరుగుతున్న రాజకీయ చైతన్యం, నిరుద్యోగ సమస్యలు తమకు అనుకూలంగా మారుతాయని ఆ పార్టీ ఆశిస్తోంది.

**జనసేనతో మరింత ఆసక్తికర పోరు!**

ఈసారి ఉమ్మడి వరంగల్––ఖమ్మం––నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జనసేన పార్టీ కూడా బరిలో నిలిచింది. ఆ పార్టీ అభ్యర్థిగా మాజీ వైద్య ఆరోగ్యశాఖ సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావును ప్రకటించింది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా గడల శ్రీనివాసరావుకు మద్దతుగా ప్రచారాన్ని ప్రారంభించారు. పట్టభద్రుల సమస్యలు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత ఆకాంక్షలను శాసనమండలిలో వినిపిస్తానని గడల చెబుతున్నారు. పవన్ కల్యాణ్‌కు యువతలో ఉన్న ఆదరణ, జనసేనకు ఉన్న రాజకీయ ప్రభావం ఈ ఎన్నికల్లో ఎంతవరకు ఓట్లుగా మారుతాయన్నది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో జనసేన ఎంతమేరకు ప్రభావం చూపుతుందన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**కవిత పార్టీ కూడా రంగంలోకి!**

తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత కూడా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఉమ్మడి వరంగల్––ఖమ్మం––నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉద్యమకారుడు, విద్యావేత్త డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యం, విద్యా అర్హతలు, బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా ఆయనకు అవకాశం కల్పించారు. పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ ఇస్మాయిల్‌కు ఎన్నికల సమన్వయ బాధ్యతలు అప్పగించారు. దీంతో ఈ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన కూడా తన రాజకీయ బలాన్ని పరీక్షించుకోనుంది.

**యువత తీర్పు ఎటువైపు?**

ఈ ఎన్నికల్లో అభ్యర్థుల వ్యక్తిగత బలం, రాజకీయ పార్టీల సంస్థాగత సామర్థ్యం, స్థానిక సమస్యలు, ప్రచార వ్యూహాలు కీలక పాత్ర పోషించనున్నాయి. గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ధన ప్రభావం కూడా గణనీయంగా ఉండేది. అయితే ఈసారి నిరుద్యోగం, ఉద్యోగాల భర్తీ, ప్రభుత్వాల పనితీరు ప్రధాన చర్చనీయాంశాలుగా మారుతున్నాయి. మొత్తంగా జెన్–జీ యువత ఓటింగ్ సరళి ఏ పార్టీకి అనుకూలంగా మారుతుందన్నది ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్‌కు ప్రభుత్వ పనితీరుపై పరీక్ష కాగా, బీఆర్ఎస్‌కు గత పాలన ప్రభావం, బీజేపీకి యువత మద్దతు, జనసేనకు పవన్ కల్యాణ్ ఆదరణ, తెలంగాణ రక్షణ సేనకు కొత్త రాజకీయ శక్తిగా ఎదిగే అవకాశం ఈ ఎన్నికల్లో పరీక్షకు రానున్నాయి. యువత ఆకాంక్షలను ఎవరు అందిపుచ్చుకుంటారో వారికే పట్టభద్రుల తీర్పులో పైచేయి దక్కే అవకాశముంది.

# మున్సిపల్ ఎన్నికలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

## 19 ప్రాంతాల్లో ఫిర్యాదులపై విచారణకు ఎస్ఈసీకి ఆదేశం

## అభ్యర్థుల తుది జాబితా ప్రకటన అక్టోబర్ 25కు వాయిదా



విజయవాడ, అక్టోబర్ 21 (వాయిస్ టుడే): ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల గడువును పొడిగించేందుకు నిరాకరించినప్పటికీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసిన 19 ప్రాంతాల్లో జరిగిన పరిణామాలపై విచారణ జరపాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఎస్ఈసీ) ఆదేశించింది. అభ్యర్థుల తుది జాబితా ప్రకటనను అక్టోబర్ 25వ తేదీకి వాయిదా వేసింది. తమ పార్టీ అభ్యర్థులను 19 ప్రాంతాల్లో నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారని, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు ఎదురైనప్పుడు రాజ్యాంగ న్యాయస్థానాలు మౌనంగా ఉండలేవని వ్యాఖ్యానించింది. ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో వాస్తవ పరిస్థితులను పరిశీలించి, బాధిత అభ్యర్థులకు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం కల్పించాలా వద్దా అనే అంశంపై మరుసటి రోజు లోగా నిర్ణయం తీసుకోవాలని ఎస్ఈసీని ఆదేశించింది. అవసరమైతే సంబంధిత జిల్లా కలెక్టర్ ఎదుట నామినేషన్లు సమర్పించే అవకాశం కల్పించాలని సూచించింది. ఈ వ్యవహారంలో తీసుకున్న చర్యలపై అక్టోబర్ 27న నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది. దీంతో ఎన్నికల సంఘం తీసుకోబోయే నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

**సుప్రీం ఆదేశాలు మాకు బూస్ట్ ఇచ్చాయి: పెద్దిరెడ్డి**

సుప్రీంకోర్టు ఆదేశాలు తమ పార్టీకి ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చాయని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఈ పరిణామంతో 19 మున్సిపాలిటీల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేసి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నామినేషన్ల సమయంలో వైసీపీ అభ్యర్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని పెద్దిరెడ్డి ఆరోపించారు. నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, గందరగోళం సృష్టించడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి ఘటనలు జరిగాయని పేర్కొన్నారు. మరోవైపు టీడీపీ నేతలు సులభంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు పోలీసులు సహకరించారని విమర్శించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తున్నారని, నోటీసులు జారీ చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీ మిథున్ రెడ్డిని ఐదు కేసుల్లో ఏ–1గా చేర్చారని తెలిపారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ పార్టీ విజయాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు జోక్యంతో రాష్ట్ర ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నామని పెద్దిరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల్లో అన్ని పార్టీల అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించాలని, పోటీలో నిలిచే అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏపీ మున్సిపల్ ఎన్నికల రాజకీయాలు మరింత వేడెక్కాయి

## సమాజ రక్షణ కోసం పోలీసుల ప్రాణత్యాగం

జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించిందని రేవంత్ రెడ్డి అన్నారు. జాతీయ స్థాయి డ్రగ్స్ నియంత్రణ సమీక్షలో తెలంగాణకు చెందిన ఈగల్ బృందం ఏడు ప్రమాణాల ఆధారంగా 80 శాతానికి పైగా స్కోరు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈగల్ బృందంతో పాటు డీజీపీ సీవీ ఆనంద్‌ను ముఖ్యమంత్రి అభినందించారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు పోలీసు శాఖ మరింత సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో పోలీసులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతోపాటు వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. పోలీసు సంక్షేమం, ప్రజా భద్రత, డ్రగ్స్ నియంత్రణకు సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## జూపల్లి సవాల్‌కు సిద్ధం.. నిరంజన్‌రెడ్డి

### పాలమూరు––రంగారెడ్డి ప్రాజెక్టుపై

### బహిరంగ చర్చకు రెడీ.. పెండింగ్ పనులు పూర్తి చేయాలని డిమాండ్

హైదరాబాద్, అక్టోబరు 21 (వాయిస్ టుడే): మంత్రి జూపల్లి కృష్ణారావు విసిరిన సవాల్‌ను స్వీకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రకటించారు. పాలమూరు––రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఎల్లూరు రిజర్వాయర్‌కు నీటిని తరలించే ఏర్పాటు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయం ఫలితమేనని నిరంజన్‌రెడ్డి తెలిపారు. తాజాగా మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించిన తూమును కూడా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరడంతోనే ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కేఎల్ఐ పథకంలో తక్కువ సామర్థ్యంతో నిర్మించిన కాల్వల కారణంగా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పాలమూరు––రంగారెడ్డి ప్రాజెక్టును ఇతర రిజర్వాయర్లు, కాల్వలకు అనుసంధానం చేసే నిర్ణయాలు తీసుకున్నామని వివరించారు. నార్లాపూర్ నుంచి ఎల్లూరుకు, ఏదుల నుంచి బుద్ధారం కాలువకు, వట్టెం రిజర్వాయర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాలువకు లింకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జరిగిన అన్యాయాలను బీఆర్ఎస్ ప్రభుత్వంలో సరిదిద్దే ప్రయత్నం చేశామని అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో ప్రస్తుతం నీరు ఉన్నందున ప్యాకేజీ–3లో అడ్డంకిగా ఉన్న మట్టిని తొలగిస్తే నీటిని తరలించేందుకు ఇబ్బంది ఉండదని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పంపులను నడిపేందుకు పెద్దగా ఇబ్బందులు లేవని, అయితే పది పంపులు ఒకేసారి నడిపితే సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని వివరించారు. ఏదుల, వట్టెం రిజర్వాయర్లలో పంపులు సిద్ధంగా ఉన్నాయని, నీటిని కరివెన వరకు తీసుకెళ్లే అవకాశం ఉందన్నారు. ప్రతి రిజర్వాయర్‌లో ఐదు టీఎంసీల నీటిని నింపవచ్చని, మిగిలిన పనులను వచ్చే ఏడాదిలో పూర్తి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పలు ప్రశ్నలు సంధించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పనులను మూడేళ్లుగా ఎందుకు నిలిపివేశారని, బీఆర్ఎస్ హయాంలో కాలువలకు ఇచ్చిన టెండర్లను ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. రద్దు చేసిన టెండర్ల స్థానంలో తిరిగి ఎందుకు టెండర్లు పిలవలేదని నిలదీశారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని బీఆర్ఎస్ కోరుతున్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రాజెక్టులకు గతంలో వ్యతిరేకంగా పనిచేసిన అధికారులను సాగునీటి సలహాదారులుగా నియమించడంలో ఆంతర్యమేమిటని విమర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావుకు వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలపై ఉన్న శ్రద్ధ పాలమూరు ప్రజల ప్రయోజనాలపై లేదని ఆరోపించారు.

## తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటేలా కళా ప్రదర్శనలు

### డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో

### ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026

### సమ్మిట్ ప్రారంభోత్సవం, కల్చరల్ కార్నివాల్‌ను ఘనంగా నిర్వహించాలి: సీఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్, అక్టోబర్ 21 (వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర పెట్టుబడుల అవకాశాలతో పాటు రాష్ట్ర గొప్ప సాంస్కృతిక, చారిత్రక వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేసేలా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్––2026ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఈ అంతర్జాతీయ సదస్సులో జానపద, శాస్త్రీయ సంగీతం, నృత్య ప్రదర్శనలతో పాటు తెలంగాణ సంప్రదాయ కళారూపాలకు విస్తృత ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. సమ్మిట్ నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై బుధవారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథుల స్వాగత ఏర్పాట్లు, ప్రారంభోత్సవ కార్యక్రమం, సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రచార వ్యూహాలు, రక్షా ఎక్స్‌పో నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. సమ్మిట్ ప్రారంభోత్సవానికి విచ్చేసే అతిథులకు తెలంగాణ సంప్రదాయ కళారూపాలతో ఘన స్వాగతం పలకాలని సీఎస్ సూచించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన జానపద కళాకారులు, సంగీత, నృత్య బృందాలకు అవకాశం కల్పించాలని తెలిపారు. తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పే కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా రాష్ట్ర వారసత్వాన్ని అంతర్జాతీయ అతిథులకు పరిచయం చేయాలని పేర్కొన్నారు. సమ్మిట్‌లో భాగంగా డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న రక్షా ఎక్స్‌పో చివరి రోజైన డిసెంబర్ 9న ప్రత్యేక ఎయిర్ షో ఏర్పాటు చేయనున్నారు. దీనిని వీక్షించేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున, అదే రోజున తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రత్యేక కల్చరల్ కార్నివాల్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం ప్రజలను ఆకట్టుకునేలా ఉండటంతో పాటు రాష్ట్ర కళాకారులకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు విస్తృత ప్రచారం కల్పించేందుకు ఈ నెల 24న హైదరాబాద్‌లో, 29న న్యూఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని సీఎస్ సూచించారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లోని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఆకర్షణీయమైన ప్రచార హోర్డింగులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌తో పాటు ప్రముఖ ప్రాంతాల్లో, హైదరాబాద్‌లో శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే మార్గంలో, ప్రధాన రహదారులు, స్టార్ హోటళ్ల వద్ద ప్రచార హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ స్థాయి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియా వేదికల ద్వారా సమ్మిట్ విశేషాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సినీ ప్రముఖులు, సెలబ్రిటీల భాగస్వామ్యంతో ప్రత్యేక షార్ట్ ఫిల్మ్‌లు రూపొందించి పెట్టుబడుల సదస్సు ప్రాధాన్యతను వివరించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శులు హరిచందన, శశాంక, ముకుంద్ రెడ్డి, అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయ సీపీఆర్ఓ మల్సూర్, డిజిటల్ విభాగం డైరెక్టర్ కర్రీ శ్రీరామ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

### సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేశ్

**పోలీసు అమరవీరులకు ఘన నివాళులు.. ప్రజాసేవకు పునరంకితం కావాలి**







సైబరాబాద్, అక్టోబర్ 21 (వాయిస్ టుడే): దేశ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేశ్ పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద ఆయన ఘనంగా నివాళులర్పించారు. తొలుత గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సీపీ డా. ఎం. రమేశ్ మాట్లాడుతూ, దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు మరణం లేదని, వారి త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. యూనిఫాం ధరించడం గౌరవమైతే, దాని గౌరవాన్ని కాపాడటం బాధ్యత అని, దేశం కోసం ప్రాణత్యాగం చేయడం అత్యున్నత త్యాగమని అన్నారు. అమరవీరుల ధైర్యం పోలీసు సిబ్బందికి మార్గదర్శకమని, వారి దేశభక్తి ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాలని ఆకాంక్షించారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంతో పాటు అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రజల రక్షణ కోసం నిరంతరం పనిచేసే పోలీసులకు ప్రజలు సహకరించాలని సీపీ కోరారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించడం వెనుక ప్రధాన ఉద్దేశం కొత్తగా పోలీసు బాధ్యతలు చేపట్టే వారికి స్ఫూర్తిని, నూతనోత్తేజాన్ని అందించడమేనని వివరించారు. విధి నిర్వహణలో పోలీసులు క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో సుమారు 154 మంది పోలీసులు అమరులయ్యారని పేర్కొంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. అమరవీరుల మరణం వారి కుటుంబాలకు తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలీసు అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు.

విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులు ఫహీముద్దీన్, కె. హన్మంత్ రెడ్డి, టి. ఈశ్వర్ రావు కుటుంబ సభ్యులను సీపీ శాలువాలతో సత్కరించారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు చేసిన సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పోలీసులు ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉండే విభాగమని, వారి విధి నిర్వహణకు ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఉగ్రవాదం, తీవ్రవాదాన్ని అణచివేసి దేశంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ఎంతోమంది పోలీసులు ప్రాణత్యాగాలు చేశారని గుర్తుచేశారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం చరిత్రను వివరిస్తూ, 1959 అక్టోబర్ 21న లడఖ్ సరిహద్దులో చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడిన 10 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రాణాలర్పించిన ఘటనను సీపీ గుర్తుచేశారు. ఆ అమరవీరుల త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోలీసు అమరవీరుల స్మారకార్థం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఒక్కొక్కరుగా అమరవీరుల స్థూపం వద్దకు చేరుకుని నివాళులర్పించారు. ఈ ఏడాది విధి నిర్వహణలో అమరులైన పోలీసుల పేర్లతో కూడిన రోల్ ఆఫ్ హానర్‌ను సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ సంజీవ్ చదివి వినిపించారు.

**రక్తదాన శిబిరం నిర్వహణ**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సీపీ డా. ఎం. రమేశ్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ శిబిరం ద్వారా రెడ్‌క్రాస్ సంస్థకు 87 యూనిట్లు, ఎన్టీఆర్ ట్రస్ట్‌కు 73 యూనిట్లు కలిపి మొత్తం 160 యూనిట్ల రక్తాన్ని అందించారు. అమరవీరుల సేవలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమం సామాజిక బాధ్యత, సేవాభావానికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, కూకట్‌పల్లి డీసీపీ రితీరాజ్, క్రైమ్స్ డీసీపీ పుష్ప, శేరిలింగంపల్లి డీసీపీ చింతమనేని శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ డీసీపీ కోటిరెడ్డి, ఉమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ సంజీవ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు, హెడ్ క్వార్టర్స్ సిబ్బంది, లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ సిబ్బంది, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జన్మదిన వేడుకలకు భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సంతోష్ రెడ్డి.

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 21(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ జన్మదిన వేడుకలు బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసేందుకు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. క్యాంపు కార్యాలయం నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సందడిగా మారగా, ఎమ్మెల్యే పుష్పగుచ్ఛాలు అందజేస్తూ, శాలువాలతో సత్కరిస్తూ, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సంతోష్ రెడ్డి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే పుట్టినరోజును పురస్కరించుకుని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. నియోజకవర్గ ప్రజలతో మమేకమవుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, పార్టీ బలోపేతానికి నిరంతరం పనిచేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

## పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీకి దసరా శుభాకాంక్షల వెల్లువ



శేరిలింగంపల్లి, అక్టోబర్ 21(వాయిస్ టుడే): దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పండుగ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, రాజకీయ ప్రముఖులు ఆయన నివాసానికి చేరుకుని మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, నాయినేని చంద్రకాంత్ రావు, నాగేశ్వర్ రావు, అల్లం మహేశ్, నరేందర్ బల్ల, నరేష్ తదితరులు ఆరెకపూడి గాంధీని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేస్తూ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజాసేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ సత్యం, ధర్మం, ఐక్యతతో ముందుకు సాగాలని ఈ పండుగ సందేశమిస్తుందని నాయకులు పేర్కొన్నారు. పండుగ సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ కూడా నాయకులకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగలు ప్రజల మధ్య సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతో పాటు నాయకుల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని ఈ కలయిక చాటిచెప్పింది.



## పోలీసు అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

### పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరానికి యువకుల రక్తదానం

పటాన్‌చెరు (వాయిస్ టుడే): పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పటాన్‌చెరు యువకులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ మహమ్మద్ ఆసిఫ్ నేతృత్వంలో యువకులు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని సీపీ కార్యాలయానికి వెళ్లి రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు తమ వంతు సహకారం అందించారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, రక్తదానం ద్వారా ప్రాణదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కార్యక్రమ నిర్వాహకులు పేర్కొన్నారు.

## బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా కాసిరెడ్డి సింధూరెడ్డి నియామకం



శేరిలింగంపల్లి, అక్టోబర్ 21 (వాయిస్ టుడే): భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా తెలంగాణకు చెందిన యువ నాయకురాలు కాసిరెడ్డి సింధూరెడ్డి నియమితులయ్యారు. చందానగర్ బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆమె, గతంలో బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ హేమంత్ జోషి మంగళవారం ఆమె నియామకాన్ని ప్రకటించారు. తెలంగాణకు చెందిన యువ మహిళా నాయకురాలికి జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు దక్కడం పట్ల బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

ఈ సందర్భంగా సింధూరెడ్డి మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి తన పూర్తి సమయాన్ని కేటాయించి, సంస్థాగత బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తానని తెలిపారు. కార్పొరేటర్‌గా పోటీ చేసే అవకాశం కల్పించడంతో పాటు, అనంతరం బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించి పార్టీ తనపై నమ్మకం ఉంచిందని పేర్కొన్నారు. యువమోర్చా ఇచ్చిన పిలుపులు, కార్యక్రమాలను చిత్తశుద్ధితో అనుసరించానని, ఇకపై కూడా యువమోర్చా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి సహకరించి, ప్రోత్సహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్ జోషి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అర్వింద్, బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కుందర్ గణేశ్, శేరిలింగంపల్లి బీజేపీ నాయకుడు ఎం. రవికుమార్ యాదవ్‌లకు సింధూరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సేవతో పాటు పార్టీ అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆమె స్పష్టం చేశారు.



## రుద్రారంలో ఘనంగా విజయదశమి వేడుకలు.. వైభవంగా రావణ దహనం

**- మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత తొలిసారిగా రావణ దహన కార్యక్రమం**

**- ఉత్సాహంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు**

పటాన్ చెరు (వాయిస్ టుడే): ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారం వార్డులో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం దసరా పండుగ ఘనంగా వేడుకలు నిర్వహించారు. కౌన్సిలర్లు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆనవాయితీ ప్రకారం భక్తిశ్రద్ధలతో జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అలనాటి సంప్రదాయాన్ని చాటిచెప్పారు. పూజా కార్యక్రమాల అనంతరం గ్రామంలో రావణ దహన కార్యక్రమం వైభవంగా చేపట్టారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే ఈ రావణ దహన వేడుకను తిలకించడానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, మహిళలు తరలివచ్చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పాండు, లత వెంకట్, సందీప్ గౌడ్, వడ్డేగడ్డ రాజు, లక్ష్మీనరసింహారెడ్డి మాట్లాడుతూ.. రుద్రారం గ్రామం కొత్తగా మున్సిపాలిటీగా రూపాంతరం చెందిన తర్వాత, మున్సిపాలిటీ పరిధిలో తొలిసారిగా ఈ రావణ దహన కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. గ్రామస్తుల సహకారంతో భవిష్యత్తులోనూ ఇలాంటి సాంస్కృతిక, పండుగ వేడుకలను మరింత ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయత్రి పాండు, మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మన్నే రాజు, హరిప్రసాద్ రెడ్డి, అలాగే పలువురు మాజీ వార్డు మాజీ ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు,యువకులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## కేటీఆర్ ఆశీస్సులు తీసుకున్న బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 21(వాయిస్ టుడే): బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ శాసన సభ్యులు కేపీ.వివేకానంద్ తన పుట్టిన రోజు సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నగరంలోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారు బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ దసరా శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, కార్యకర్తలు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 21(వాయిస్ టుడే): షాపూర్‌నగర్‌లోని నివాస కార్యాలయంలో కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ దసరా పండుగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.



## ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజలు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 21(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, మరియు తదితరులు మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.. దసరా పండుగ పర్వదిన సందర్భంగా శాలువాలతో సత్కరించి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
గురువారం 22 అక్టోబరు 2026

# గీతంలో సినీవారం 2026 ప్రారంభం



## పాశ మైలారంలో ఘనంగా విజయదశమి వేడుకలు.. వైభవంగా రావణ దహనం

### రావణ దహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్

### – ఉత్సాహంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు

పటాన్ చెరు (వాయిస్ టుడే): పటాన్‌చెరు నియోజకవర్గ ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశ మైలారం వార్డులో మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఘనంగా రావణ దహన కార్యక్రమం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అలనాటి సంప్రదాయాన్ని చాటిచెప్పారు. పూజా కార్యక్రమాల అనంతరం గ్రామంలో రావణ దహన కార్యక్రమం వైభవంగా చేపట్టారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే ఈ రావణ దహన వేడుకను తిలకించడానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, మహిళలు తరలివచ్చారు. ఈ సందర్భంగా సుధాకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దుర్గ భవాని మాత గ్రామ ప్రజలపై ఆశీర్వాదం ఉండాలని సుఖశాంతుల అష్టైశ్వర్యాలతో ఈ రావణ దహన కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సరిత సుధాకర్ గౌడ్, సాయి గౌడ్ మాజీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు,యువకులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## పటాన్‌చెరులో ప్రముఖులను కలిసిన మాద్రి పృథ్వీరాజ్

పటాన్ చెరు (వాయిస్ టుడే): దసరా పండుగ సందర్భంగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి , ఉమ్మడి సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్లు సపనదేవ్, శంకర్ యాదవ్ ప్రముఖులు మనోహర్ రెడ్డి, కుమార్ యాదవ్ తో పాటు పలువురు నాయకులను కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో MDR యువసేన సభ్యులు పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



## దసరా సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

### చెడుపై మంచి విజయానికి ప్రతీక విజయదశమి.. ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి

### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు (వాయిస్ టుడే): చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, ధర్మానికి విజయద్వారంగా నిలిచే విజయదశమి పండుగను పురస్కరించుకొని పటాన్చెరు పట్టణంలో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. మంగళవారం సాయంత్రం మైత్రి స్టేడియంలో నిర్వహించిన దసరా వేడుకల్లో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ వేడుకల్లో భాగంగా తొలుత జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద నిర్వహించిన ధ్వజారోహణ కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన షమీ పూజలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి స్థానిక ప్రజాప్రతినిధులు, పురప్రముఖులతో కలిసి మైత్రి స్టేడియంలో నిర్వహించిన రావణాసుర దహన కార్యక్రమానికి హాజరయ్యారు. రావణాసుర దహనంతో చెడుపై మంచి సాధించిన విజయాన్ని చాటుతూ నిర్వహించిన ఈ వేడుకలు ప్రజల్లో పండుగ ఉత్సాహాన్ని నింపాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. దసరా పండుగ ధర్మం, ధైర్యం, న్యాయం, సత్యం వంటి సద్గుణాలకు ప్రతీక అని పేర్కొన్నారు. రావణాసుర దహనం మనలోని చెడు ఆలోచనలు, అహంకారం, అన్యాయాలను విడిచిపెట్టి మంచిని ఆచరించాలనే సందేశాన్ని అందిస్తుందని తెలిపారు. విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, సరికొత్త విజయాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. పటాన్చెరు నియోజకవర్గ ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజల మధ్య ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించే పండుగలను ప్రజలందరూ కలిసిమెలిసి జరుపుకోవడం మన సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. దసరా వేడుకలతో మైత్రి స్టేడియం పండుగ శోభను సంతరించుకోగా, రావణాసుర దహన కార్యక్రమం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక ప్రజాప్రతినిధులు, పురప్రముఖులు, ప్రజలు ఈ సంబరాల్లో పాల్గొన్నారు.

### సృజనాత్మకత, సినిమా నిర్మాణ నైపుణ్యాలను పెంపొందించుకుంటున్న విద్యార్థులు

పటాన్ చెరు (వాయిస్ టుడే): ఎల్లప్పుడూ రొటీన్ చదువులతో విసిగిపోకుండా, కాస్తంత వైవిధ్యాన్ని చాటేలా సినీవారం 2026 కార్యక్రమానికి హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శ్రీకారం చుట్టింది. మీసేవ సహకారంతో, గీతం విద్యార్థి విభాగం జి-స్టూడియో ఈ రెండు రోజుల కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించింది. విద్యార్థుల సృజనాత్మకతను, సినిమా నిర్మాణ నైపుణ్యాలను పెంపొందించేందుకు రూపొందించిన కార్యశాలలు, సినిమా ప్రదర్శనలు, ఫోటోగ్రఫీ ప్రదర్శనలు, ఆటలు, ముఖాముఖి వంటి ఆసక్తికరమైన కార్యక్రమాలతో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు.



ఈ ఉత్సవం సినీ పరిశ్రమ నిపుణులను, ఔత్సాహిక చిత్ర నిర్మాతలను ఒకచోట చేర్చి, సినిమాలోని వివిధ అంశాలపై విలువైన అంతర్దృష్టులను అందిస్తుంది. విద్యార్థుల ఎంట్రీలను మూల్యాంకనం చేయడానికి ఫ్యూజిఫిల్మ్ఎక్స్ ఇండియా సౌహార్ద్ర రాయబారి బాబ్జ్ చౌదరి ఫోటోగ్రఫీ ప్రదర్శనను సందర్శించగా, డైరెక్టర్ నిఖిల్ నాదెళ్ల ఒక కార్యశాలను నిర్వహించారు. ఈ వేడుకలకు వినోదాన్ని, ఉత్సాహాన్ని జోడిస్తూ, స్టార్ స్విచ్, బ్రెయిన్ ఇన్ ఎ కప్, ఫిస్ట్ అండ్ ఫింగర్స్, కప్ ఇట్, పోలరాయిడ్ ఫోటో బూత్ వంటి ఉత్సాహభరితమైన గేమ్ స్టాల్స్ కూడా ఈ కార్యక్రమంలో ఉన్నాయి.

రెండవ రోజు (గురువారం) స్టోరీబోర్డింగ్ పోటీ, డాక్యుమెంటరీ ఫోటోగ్రాఫర్ కిషోర్ కృష్ణమూర్తి నిర్వహించే 'మీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని డాక్యుమెంట్ చేయడం' అనే కార్యక్రమం, సంగీత స్వరకర్త తమన్ తో ముఖాముఖి ఉంటాయి. వర్ధమాన చిత్ర నిర్మాతల కథ చెప్పే ప్రతిభను, సృజనాత్మక దృష్టిని చాటిచెప్పే షార్ట్ ఫిల్మ్ పోటీకి చిత్ర నిర్మాత కృష్ణ చైతన్య అతిథిగా హాజరవుతారు. విద్యార్థులు ఈ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటూ, పరిశ్రమ నిపుణులతో సంభాషిస్తూ, తమ సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. వారు ఈ విభిన్నమైన అభ్యాస అవకాశాలను ప్రశంసించడమే గాక, ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించినందుకు విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. సినీవారం 2026 ద్వారా, గీతం హైదరాబాదు విద్యార్థులకు సినిమాను అన్వేషించడానికి, ఆలోచనలను పంచుకోవడానికి, వారి సృజనాత్మక, సాంకేతిక సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి ఒక ఉత్తేజకరమైన వేదికను అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



## కూకట్‌పల్లిలో డామా గ్యాస్ట్రో క్లినిక్ ప్రారంభం

### తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అభినందనీయం: ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

కూకట్‌పల్లి: అక్టోబర్ 21(వాయిస్ టుడే): కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నంబర్--1లో నూతనంగా ఏర్పాటు చేసిన డామా గ్యాస్ట్రో క్లినిక్‌ను జనసేన పార్టీ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాన్య ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ప్రజలకు అందుబాటు ధరల్లో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో డాక్టర్ నారాయణరావు క్లినిక్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, బి.ఎన్. రణదీప్, దాసరి వెంకట్, ఆళ్ల నరేంద్ర, వైద్య సిబ్బంది, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపిన డా. సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి, అక్టోబర్ 21(వాయిస్ టుడే): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం కుటుంబ సమేతంగా రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి దంపతులను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల బొకే అందించి, శాలువాతో సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. వేం నరేందర్ రెడ్డికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం కలగాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్ చెరు (వాయిస్ టుడే): శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని తెల్లాపూర్, ముత్తంగి డివిజన్ల పరిధిలోని తెల్లాపూర్, పాటి గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన ఉత్సాహాన్ని, సానుకూలతను నింపాలని కోరుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తూ, సంప్రదాయబద్ధంగా ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులు, భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికీ దుర్గామాత ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలు దేశానికి గర్వకారణం: శ్రీరామ్ వెంకట్




సికింద్రాబాద్, అక్టోబర్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి): సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు పోలీసులు చేస్తున్న సేవలు అభినందనీయమని మహంకాళి జిల్లా ఇంటెలెక్చువల్ సెల్ కన్వీనర్ శ్రీరామ్ వెంకట్ అన్నారు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ ఇన్‌స్పెక్టర్ దాసును కలిసి పోలీసుల సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ధైర్యం, అంకితభావం, దేశభక్తి ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పోలీసు అమరవీరులకు ఘన నివాళులర్పిస్తూ, విధి నిర్వహణలో ఉన్న ప్రతి పోలీసు సోదరుడికి అభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తార్నాక డివిజన్ అధ్యక్షుడు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి.. 23న రాష్ట్రవ్యాప్త నిరసనలు

### ప్రజా సంఘాల రాష్ట్ర నాయకుల పిలుపు

సికింద్రాబాద్, అక్టోబర్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 23న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో దిష్టిబొమ్మల దహనం, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు తీగల సాగర్, జె. వెంకటేష్, బి. ప్రసాద్, ఎండీ అబ్బాస్, అరుణ జ్యోతి, స్కైలాబ్ బాబు, పి. ఆశయ్య, కోట రమేష్ మాట్లాడుతూ.. పారదర్శకత లేకుండా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన వారి ఓటు హక్కును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిరసనకారులపై దాడులు, అక్రమ నిర్బంధాలను నిలిపివేయాలని కోరారు. ఎన్నికల కమిషనర్ నియామక చట్టంలో మార్పులు చేయాలని, ఎన్నికల కమిషనర్లకు చట్టపరమైన రక్షణ కల్పించే నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులు, ఓటు హక్కు పరిరక్షణ కోసం కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, మేధావులు ఐక్యంగా ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, ఉపాధ్యక్షులు వి.ఎస్. రావు, ఈశ్వర్ రావు, పద్మశ్రీ, సహాయ కార్యదర్శి పాలడుగు సుధాకర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాల్లో పాల్గొన్న మేయర్ శ్రీనివాస్, సీపీ గౌస్ ఆలం



కరీంనగర్,అక్టోబర్ 21(వాయిస్ టుడే): నగరంలో జరిగిన దసరా ఉత్సవాల్లో దుర్గామాత ఊరేగింపులో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్,పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం పాల్గొని శమీ పూజలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్,పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ దసరా ఉత్సవాలు సామర్యతకు, ఐకమత్యానికి ప్రత్యేక అని అన్నారు.





# ఉప్పల్ జిహెచ్ఎంసి గ్రౌండ్లో జన ప్రభంజనం

**అంబరాన్ని అంటిన.. దసరా సంబురాలు...**

**50వేల మందితో జన సందోహాల మధ్య దసరా సంబరాలు**

**ఘనంగా దసరా సంబరాలు.**

**పల్లె వాతావరణం ఉట్టిపడేలా ం దసరా ఉత్సవాలు**

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- ఉప్పల్ జిహెచ్ఎంసి గ్రౌండ్లో గత 20 సంవత్సరాల పైబడిగా ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి ఆయన సతీమణి ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రావణ దహనానికి సుమారు 50 వేల మంది ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి... కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రజిత పరమేశ్వర్ రెడ్డి...లు ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి నిజంగా పైనుండి... పార్వతి... పరమేశ్వరులూ దిగి వచ్చిన విధంగా ఈ కార్యక్రమానికి తరలివచ్చిన పట్టణ ప్రజలు

పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉప్పల్ దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా,ఉత్సాహభరితంగా జరిగాయి.

ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో దసరా ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందుముల పరమేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి, వజ్రేష్ యాదవ్, భూపతి రెడ్డి నర్సిరెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథుల చేతుల మీదుగా జమ్మి పూజ, రావణ దహనం తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాలు పల్లె వాతావరణాన్ని తలపించేలా ఉండటంతో పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ పట్టణ పెద్దలు, ప్రముఖులు కందికంటి అశోక్ కుమార్ గౌడ్,సల్ల రాజిరెడ్డి , బొమ్మగోని దాస్ గౌడ్,పాశికంటి నాగరాజు, బజార్ జగన్నాథ్ గౌడ్, బాకారం లక్ష్మణ్ గారు , బజారు పాండు గౌడ్, చెన్నారెడ్డి రఘుపతి రెడ్డి, తెల్కల మోహన్ రెడ్డి, ఈగ అంజయ్య ముదిరాజ్, లింగంపల్లి రామకృష్ణ, బజారు రామరాజ్ గౌడ్, పూజాల ప్రభాకర్, రంగనాథ్ గౌడ్, బూసం రఘునాథ్ రెడ్డి, సుంకు శేఖర్ రెడ్డి, ఈగ సంతోష్ ముదిరాజ్, సల్ల ప్రభాకర్ రెడ్డి, ఆగం రెడ్డి, గౌరిగె ఐలయ్య, దేవిరెడ్డి, మంద మురళీకృష్ణ రెడ్డి, గౌరిగె నాగేష్, వర్కల మదన్, రామ్ రెడ్డి తదితరులు, అలాగే ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించడంతో ఉప్పల్ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొని వేడుకలను ఆస్వాదించారు.

## ఎమ్మెల్యేకు శ్రీరాముడి బాణం బహూకరించిన తోట పవన్



హనుమకొండ జిల్లా, అక్టోబర్ 21(వాయిస్ టుడే): విజయదశమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఘనమైన రావణ వధ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్ శ్రీరాముడి బాణాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా విజయదశమి పర్వదినం సందర్భంగా చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించిన రావణ వధ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విజయదశమి ఉత్సవ సమితి అధ్యక్షుడు రావుల సుదర్శన్, హనుమకొండ మాజీ శాసన సభ్యులు ధర్మారావు, ఎనుగుల రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షుడిగా రంగు శేఖర్ గౌడ్ నియామకం

**పార్టీ బలోపేతానికి కృషి చేస్తా ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం**

**రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యం: రంగు శేఖర్ గౌడ్**

ఉప్పల్, అక్టోబర్ 21 : తెలంగాణ రక్షణ సేన వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడిగా రంగు శేఖర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు, ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జి శ్రావణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రంగు శేఖర్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో డివిజన్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని వాటిని విజయవంతం చేస్తానని పేర్కొన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు. డివిజన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో తెలంగాణ రక్షణ సేనను మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని రంగు శేఖర్ గౌడ్ వెల్లడించారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన తెలిపారు.

# విజయాలు, సుఖసంతోషాలు అందరికీ కలగాలి

### వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శమీ పూజ.. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు



వరంగల్, అక్టోబర్ 21: ప్రతి ఒక్కరి జీవితంలో విజయాలు వెల్లివిరిసి, కుటుంబాల్లో సుఖసంతోషాలు నిండాలని ఆకాంక్షిస్తూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం సంఘం ప్రాంగణంలో శమీ పూజను సంప్రదాయబద్ధంగా నిర్వహించి పండుగ శోభను చాటారు. సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్ట స్థానం కలిగిన విజయదశమి పండుగను భక్తిభావంతో జరుపుకుంటూ, శుభం, విజయం, అభ్యున్నతికి ప్రతీకగా భావించే శమీ పూజలో సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నడిపెల్లి వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. సంఘ సభ్యులతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం అభివృద్ధి సాధించాలని, సమాజంలో ప్రేమాభిమానాలు, ఐకమత్యం వెల్లివిరియాలని కోరుకున్నారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలని, వాటిని పరస్పర ఆత్మీయతతో జరుపుకోవడం సామాజిక బంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఈ వేడుకలు చాటి చెప్పాయి. శమీ పూజతో విజయదశమి వేడుకలకు ఆధ్యాత్మిక శోభ చేకూరింది. ఈ కార్యక్రమంలో సంఘం ట్రెజరర్ సిద్ధూరి స్వామి రావు, జాయింట్ సెక్రటరీ పల్లెపాటి విద్యాసాగర్ రావు, ఈసీ సభ్యులు లింగంపెల్లి పాపారావు, తక్కళ్లపెల్లి అమృత రావు, పిన్నింటి వెంకటేశ్వర్ రావు, గంధ్ర గోపాల్ రావు, గుజ్జ గోపాల్ రావు, స్పెషల్ ఇన్వైటీ పల్లెపాటి బాలకిషన్ రావుతో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావుకు రేణుక ఎల్లమ్మ దేవస్థానం కమిటీ సత్కారం

**దేవస్థానం అభివృద్ధి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.. వి.హనుమంతరావు..**



సికింద్రాబాద్, అక్టోబర్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని అంబర్‌పేట్ సీనియర్ సిటిజన్స్, తిరుమల నగర్ శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం కమిటీ సభ్యులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ ముఖ్య సలహాదారు వి.హనుమంతరావును అంబర్‌పేట్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన అంశాలతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను కమిటీ సభ్యులు వి.హనుమంతరావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను ప్రభుత్వం దృష్టికి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ చైర్మన్ రాంపల్లి జైహింద్, అధ్యక్షుడు తూర్పు రామ్‌చందర్, కార్యదర్శి జి.సత్యనారాయణ, ఉప్పరాళ్ల సోమిరెడ్డి, భాగ్యపల్లి లక్ష్మీనారాయణ, రుద్రగౌని శ్రీధర్ గౌడ్, గుండెల్లి కిరణ్ కుమార్, టి.మల్లేష్ యాదవ్, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పట్టభద్రుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఉప్పు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## చిన్నక్రాంతి కాలనీలో ఘనంగా దసరా పండుగ వేడుకలు

**అంబరాన్నంటిన దసరా సంబరాలు**

బోడుప్పల్/సికింద్రాబాద్, అక్టోబర్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి):

మేడ్చల్ జిల్లా చెంగిచర్ల డివిజన్ పరిధిలోని చిన్నక్రాంతి కాలనీలో విజయదశమి (దసరా) వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ముగిశాయి. చిన్నక్రాంతి కాలనీ హౌసింగ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కాలనీవాసులు, మహిళలు, పిల్లలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. కాలనీ అధ్యక్షుడు మేడ బాపురాజు, కోశాధికారి శివ కుమార్ పటేల్, గౌరవ అధ్యక్షుడు గౌరిగే నరసింహ కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్ నిలుగొండ వెంకటేష్ గౌడ్, కమిటీ సభ్యుల ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన ఈ పండుగ వేడుకలు కాలనీలో ఆధ్యాత్మిక శోభను నింపాయి. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని కాలనీ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి పెద్ద ఎత్తున పాల్గొని పూజలు పూర్తి చేసి ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం కాలనీవాసులంతా ఒకరికొకరు జమీ పత్రాన్ని (బంగారం) మార్చుకుంటూ, "పాండవుల జమీ చెట్టు – బంగారమాయె" అని చెప్తూ పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు. ఆప్యాయతా అనురాగాలతో పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు మేడ బాపురాజు మాట్లాడుతూ... "చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతమే దసరా పండుగ. కాలనీవాసులందరూ ఐక్యమత్యంతో, సోదరభావంతో ఇలాంటి వేడుకలను జరుపుకోవడం ఎంతో సంతోషాన్నిస్తోంది. మన కాలనీ అభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. ఈ వేడుకలు ఇంత విజయవంతంగా జరగడానికి సహకరించిన కాలనీ కార్యవర్గ సభ్యులకు, స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యువతకు మరియు కాలనీ నివాసులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, కమిటీ ప్రతినిధులు, కాలనీ మహిళలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని వేడుకలను దిగ్విజయం చేశారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బరిలోకి కవిత పార్టీ

**వరంగల్–ఖమ్మం–నల్గొండ అభ్యర్థిగా డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ ప్రకటన**



హైదరాబాద్, అక్టోబర్ 21 (వాయిస్ టుడే): తెలంగాణ రక్షణ సేన ప్రత్యక్ష ఎన్నికల సమరానికి సిద్ధమైంది. పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్న కవిత.. ఉమ్మడి వరంగల్––ఖమ్మం––నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉద్యమకారుడు, విద్యావేత్త డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను ప్రకటించారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల ప్రచారం, క్షేత్రస్థాయి సమన్వయ బాధ్యతల కోసం పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ ఇస్మాయిల్‌ను స్టేట్ పార్టీ అబ్జర్వర్, ఎన్నికల కో–ఆర్డినేటర్‌గా నియమించారు. పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగ యువత ఆకాంక్షలను ప్రధాన ఎజెండాగా తీసుకుని ప్రచారాన్ని నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. అభ్యర్థి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సింహులపేట మండలం కౌసల్యాదేవిపల్లికి చెందినవారు. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి దశ నుంచే చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణ జాగృతి ఆవిర్భావం నుంచి కవిత వెంట నడుస్తూ, పార్టీ అధికార ప్రతినిధిగా టీవీ చర్చలు, ప్రజా వేదికలపై తన గళాన్ని వినిపించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఉన్నత విద్యావంతుడిని అభ్యర్థిగా ఎంపిక చేయడం ద్వారా బహుజన ప్రాతినిధ్యానికి ప్రాధాన్యమిచ్చినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. తెలంగాణ రక్షణ సేన తొలి ఎన్నికగానే పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని ఎంచుకోవడంతో ఉమ్మడి వరంగల్––ఖమ్మం––నల్గొండ రాజకీయాల్లో ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారనుంది.

వాయిస్

హైదరాబాద్
గురువారం 22 అక్టోబరు 2026



## పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**అమరవీరుల ఆశయాల సాధనే వారికి నిజమైన నివాళి**

**వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

హనుమకొండ జిల్లా, అక్టోబర్ 21 (వాయిస్ టుడే): దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా హనుమకొండ చౌరస్తా నుంచి పోలీస్ హెడ్క్వార్టర్స్ వరకు పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛం సమర్పించి వీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని, వారి కుటుంబాలకు సమాజం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అంకితభావంతో సేవలందించడమే అమరవీరులకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.



## శివనగర్ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శమి పూజ కార్యక్రమం

వరంగల్ ( వాయిస్ టుడే ) అక్టోబర్ 21 : విజయదశమి దసరా సందర్భంగా శివ నగర్ లో మంగళవారం నాడు శమీ పూజ, ఆయుధ పూజ మరియు కూష్మాండబలి పూజను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమం మొదలు రామాలయం నుండి కమిటీ అధ్యక్షులు సుంచుమాధవ్ జమ్మితో అలాగే ప్రధాన కార్యదర్శి దామరగిద్ద ప్రభాకర్ కూష్మాండంతో కోశాధికారి మేరుగు అశోక్ ఖడ్గ దారనతో మంగళ వాయిద్యాలతో, మహిళ లు,శివ నగర్ వాసుల తో కలిసి ఆనందోత్సవాలతో మధ్య పెద్ద సంఖ్యలో అంగరంగ వైభవంగా ఊరేగింపుగా బయలు దేరి శ్రీ రమా రహిత సత్యనారాయణ స్వామి దేవస్థానని చేరుకున్నారు అనంతరం కార్యక్రమం లో మేరుగుఅశోక్ కూస్మాండబలి చేయగా శమీ పూజను సుంచు మాధవ్ చేసి దసరా ఉత్సవాన్ని నిర్వహించడం జరిగినది.

ఈ ఉత్సవంలో ఉపాధ్యక్షులు బైరి శ్యామ్ , సుంచు కేశవ్, సహాయ కార్యదర్శులు రాసకచ్చుల రమేష్, దండు సమ్మయ్య కార్యదర్శి గూడూరు మధుసూదన్ కార్యవర్గ సభ్యులు సుంచు భాగ్యమ్మ,బైరి బుచ్చమ్మ,బండారు జ్యోతి,బైరి ప్రభాకర్,నాంచార్ల బ్రహ్మచారి, సదనం శ్యామ్, దుండే జోగేందర్, మరియు శ్రీ సత్య గణపతి ఉత్సవ యూత్ కమిటీ, మహిళా యూత్ కమిటీ,35వ డివిజన్ పద్మశాలి అధ్యక్షులు గడ్డం రవి, బిల్ల రాజు, దండు అరుణ, దామెరగిద్ద హేమావతి, మార్త ఉష,గోగుల ఇందిరా, కోతి స్వరూప, వార్డులోని ప్రముఖులు మరియు మహిళలు పాల్గొన్నారు



## రంగసాయిపేటలో వైభవంగా జమ్మి పూజ

**- బొడ్రాయి వద్ద దసరా వేడుకలు**

వరంగల్ ( వాయిస్ టుడే ) అక్టోబర్ 21 : వరంగల్ నగరంలోని 42వ డివిజన్ రంగసాయిపేటలో మంగళవారం సాయంత్రం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది స్థానిక శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం వద్ద ఉన్నటువంటి బొడ్రాయి వద్ద రాష్ట్ర బిజెపి నాయకుడు కొల్లూరు యోగానంద్ ఆధ్వర్యంలో దసరా వేడుక నిర్వహించారు అంతకుముందు రామాలయంలో అర్చకులు తిరుమల శ్రీధర్ ఆచార్యులు జమ్మి పూజ నిర్వహించారు. అనంతరం బొడ్రాయి ముందు బలిహరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి యోగానంద్, తో పాటు నాగేల్లి సత్యనారాయణ, సోమ అనిల్, సాంబశివుడు, నిరంజన్, రాజు బిస్కెట్ రవి, చందర్, కొల్లూరి శ్రీనివాస్, రామ్ చరణ్, తోషిత్ నందన్, జమున, అర్చన, రమాదేవి, లక్ష్మీదేవి ,ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రంగశాయిపేటలో ఘనంగా రావణవధ వేడుకలు

**- ముఖ్యఅతిథిగా కొండా సురేఖ.**

**- రావణ ప్రతిమకు నిప్పంటించిన గుండు సుధారాణి**

**- వివిధ రకాల మిరిమిట్లు గొలిపే బాణాసంచాల ఏర్పాట్లు**

**- ఆకట్టుకున్న దూపకుంట కరుణాకర్ కళాబృందం వారు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు**



వరంగల్ ( వాయిస్ టుడే ) అక్టోబర్ 21: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం రంగశాయిపేటలోని మహంకాళి గుడి ఆవరణలో దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రావణవద కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమనికీ మాజీ మంత్రి, తూర్పు ఏమ్మెల్యే కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరు కాగా, విశిష్ట అతిథిగా విచ్చేసిన కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (ఖఖణూ) చైర్పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, జి డబ్ల్యు ఎం సి మాజీ మేయర్ గుండు సుధారాణి రావణ ప్రతిమ కు నిప్పంటించినారు. ప్రత్యేక అతిథులుగా హైదరాబాద్ ఫ్యామిలీ కోర్టు సెషన్స్ జడ్జి డాక్టర్ కంచ ప్రసాద్, సీనియర్ పాత్రికేయులు శంకేసి శంకర్ రావు, 42 వడివిజన్ మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, 41, వ ,డివిజన్ మాజీ కార్పొరేటర్ పోషాల పద్మ స్వామి, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ జనార్ధన్ లు విచ్చేసినారు. అంతకుముందు దసరా ఉత్సవ సమితి అధ్యక్షులు గుండు పూర్ణచందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొండా సురేఖ మాట్లాడుతూ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ రాముడు రావణాసురున్ని వధించిన రోజైన విజయదశమి నాడు దసరా పండుగగా జరుపుకుంటున్నామని అన్నారు. ఇంత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఉత్సవ సమితి వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు.

గుండు సుధారాణి మాట్లాడుతూ రావణ వధ కార్యక్రమాన్ని ఇంత పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన దసరా ఉత్సవ సమితి వారిని అభినందిస్తూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ విజయదశమి రోజున మనందరం ప్రతి సంవత్సరం దసరా పండుగను జరుపుకుంటున్నామని, ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. డాక్టర్ కంచ ప్రసాద్ మాట్లాడుతూ ఆనాడు రావణుడి ఆగడాలను అరికట్టడానికి శ్రీ రాముడు రావణున్ని సంహరించారని అన్నారు. ఇది ప్రజలందరి విజయంగా భావించిన ఈ విజయదశమి రోజున దసరా పండుగను జరుపు కుంటున్నామని, ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు.

శంకేసి శంకర్ రావు మాట్లాడుతూ గత 43 సంవత్సరాల క్రితం రంగశాయిపేటలోని కొంతమంది పెద్దలు ప్రారంభించిన ఈ రావణవద కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నందుకు దసరా ఉత్సవ సమితి వారిని అభినందిస్తూ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారని అన్నారు. ఇంకా ఈ సమావేశంలో 42 వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, 41 వడివిజన్ మాజీ కార్పొరేటర్ పోశాల పద్మ స్వామి, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ జనార్ధన్ లు ప్రసంగించినారు. దసరా ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి దామెరకొండ కరుణాకర్ వందన సమర్పణ చేసినారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల నవీన్ రాజ్, దసరా ఉత్సవ సమితి అధ్యక్షులు గుండు పూర్ణచందర్, ప్రధాన కార్యదర్శి దామెరకొండ కరుణాకర్, కోశాధికారి కొక్కొండ భాస్కర్, ముఖ్య సలహాదారులు ముత్తినేని రామమూర్తి, మండల లక్ష్మయ్య, డాక్టర్ పోతు దర్శనం, బివి రామకృష్ణ ప్రసాద్, మడుపోజు రామ్మూర్తి, ఉపాధ్యక్షులు పరికిపండ్ల రాజేశ్వర్ రావు, డాక్టర్ కోట శ్రీధర్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులు బక్కి వంశీ, పాకాల మనోహర్, డాక్టర్ రేణికుంట్ల ప్రవీణ్, కార్యదర్శులు బజ్జూరి వీరేశం, పస్తం బిక్షపతి, కత్తెరపల్లి వేణు, కమిటీ సభ్యులు ఏలుగు అశోక్, అల్లం వీరస్వామి, దేవునూరి వెంకటేశ్వర్లు, గుండు నవీన్ కుమార్ లతోపాటు రామాలయం ధర్మకర్తలు ఆవునూరి కుమార్, విలాసాగరం శ్రీనివాస్, నాగమయ్య గుడి ధర్మకర్తలు శంకేషి అనిల్ కుమార్, వనం వేణు, మేరవాడ శివాలయం ధర్మకర్త పాలకుర్తి సుమన్, స్థానిక నాయకులు మంతెన సునీత, ఇటికాల అశోక్, బోలుగొడ్డు అనిల్ కుమార్, సయ్యద్ బషీర్, కర్ర కుమార్, వడ్డే శిరీష్, ఉప్పునూతల శివ, మునుకుంట్ల విజయ, అంబటి రమ మరియు మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు అండగా ఉంటా..

**పేదల భూములపై పెద్దల కన్ను పడింది**

**అర్హులైన గుడిసెవాసులకు పట్టాలిచ్చి, పక్కా ఇళ్లు నిర్మించాలి**

**కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను ఇబ్బందులకు గురిచేస్తోంది**

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్**

హనుమకొండ జిల్లా, అక్టోబర్ 21 (వాయిస్ టుడే):లి వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పేదల హక్కులను కాలరాయాలని చూస్తే సహించేది లేదని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండలోని వడ్డేపల్లిలో తన నివాసంలో వైఎస్సార్ నగర్ గుడిసెవాసులు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. తమను కొందరు కాంగ్రెస్ నాయకులు బెదిరిస్తున్నారని, తమ నివాస స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ వినతిపత్రం అందజేసి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ వైఎస్సార్ నగర్లో పేదలు నివసిస్తున్న భూములపై కొందరు పెద్దల కన్ను పడిందని ఆరోపించారు. సీలింగ్ యాక్ట్ పరిధిలో ఉన్న భూముల్లో నిర్మాణాలు జరిగాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కొన్ని నిర్మాణాలకు అనుమతులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు మేలు చేయడం పక్కనబెట్టి, వారిని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. గుడిసెవాసులను బెదిరిస్తూ, విలువైన స్థలాలను కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పేదలను భయభ్రాంతులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. వైఎస్సార్ నగర్లో నివసిస్తున్న అర్హులైన గుడిసెవాసులందరికీ తక్షణమే ప్రభుత్వ పట్టాలు పంపిణీ చేయాలని, వారికి అక్కడే పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో పోరాడుతుందని, బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ నగర్ కాలనీవాసులు, మహిళలు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం..

**విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన 25 మంది పోలీసులకు ఘన నివాళి**

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్**



హనుమకొండ, అక్టోబర్ 21 (వాయిస్ టుడే): దేశ రక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి మరియు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు 25 మంది పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అమరులయ్యారని తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం హనుమకొండ పోలీస్ హెడ్క్వార్టర్స్‌లోని అమరవీరుల స్థూపం వద్ద హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్పాయి, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, అమరవీరుల కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ఏటా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, సైబర్ నేరాల నివారణలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అమరవీరుల ధైర్యం, కర్తవ్యనిష్ఠ యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, వారి త్యాగాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల సంక్షేమానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చించి కృషి చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అడిషనల్ డీసీపీలు రాయల ప్రభాకర్ రావు, బాలస్వామి, సురేష్, శ్రీనివాస్, ఏసీపీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 17 వేల మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలి

**బిజెపి రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు**




వరంగల్( వాయిస్ టుడే) అక్టోబర్ 21 : వరంగల్ తూర్పు లోని పోచమ్మ మైదాన్ కూడలిలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మె కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొని ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖలో ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న సుమారు 17,000 మంది ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని, అలాంటి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు.

సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు తమ హక్కుల కోసం నిరవధిక సమ్మెకు దిగాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని పేర్కొన్నారు. 17,000 మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేసి, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని ఎర్రబెల్లి ప్రదీప్ రావు డిమాండ్ చేశారు.

# విధినిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు

# ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం:జిల్లా ఎస్పీ

**చందుర్తి మండలం లింగంపేట అమరవీరుల స్తూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించి, నివాళులర్పించిన జిల్లా ఎస్పీ.**

**పోలీస్ అమరుల త్యాగాన్ని స్మరిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఎస్పీ మహేష్ బి.గితే పరామర్శ.**

**శాంతి భద్రతల పరిరక్షణకై విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు అందరికీ స్ఫూర్తిదాయకం**

**జిల్లా ఎస్పీ మహేష్ బి గితె**



రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 21 (వాయిస్ టుడే): జిల్లాలోని చందుర్తి మండలం లింగంపేట గ్రామ శివారులో ఉన్న పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం (ఫ్లాగ్ డే) నిర్వహించి, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారులతో కలిసి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోలీసులు"శోక్ శ్రస్త్" నిర్వహించి, మరణించిన పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు, సిబ్బంది అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి గత ఏడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన 154 మంది పోలీస్ అమరవీరుల పేర్లను చదివి వినిపించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకై సవాళ్లను ధీటుగా ఎదురించి, ప్రాణాలను సైతం త్యాగం చేసి, విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు.శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణత్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతారని పేర్కొన్నారు. జిల్లాలో అంతర్గత భద్రత పరిరక్షణ విధుల్లో 08 మందికి పైగా పోలీసులు అసువులు బాసారని, వారి త్యాగఫలం వల్లే గతం కంటే ప్రస్తుత పరిస్థితి మెరుగ్గా ఉందని, పోలీసుల త్యాగనిరతిని నిరంతరం మననం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని, విధి నిర్వహణలో భాగంగా ఎన్నో జటిలమైన సవాళ్లు ఎదురవుతున్నా అమరవీరులు అందించిన స్ఫూర్తితో ప్రజల భద్రత, రక్షణ చర్యల్లో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ముందుకు సాగుతున్నామని అన్నారు. దేశ సరిహద్దుల్లోని ఆక్సాయ్ చిన్ ప్రాంతంలో పహార కాస్తున్న సిఆర్పిఎఫ్ పోలీసులను 1959లో ఇదే రోజున చైనా దేశానికి చెందిన సైనికులు హతమార్చారని, అప్పటినుండి వారి త్యాగాలను స్మరిస్తూ అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినం జరుపుకోవడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన అమరవీరుల కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు, వారి యొక్క సమస్యలను ఎస్పీ ఆరా తీశారు.వారు విన్నవించిన సమస్యలను సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందజేశారు.పోలీస్ అమరవీరులను స్మరిస్తూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు నుండి 31 తేదీ వరకు రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీ, క్యాండిల్ ర్యాలీ, రన్, ఓపెన్ హౌస్, వ్యాసరచన పోటీలు, ఫోటో, వీడియో పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.ఈకార్యక్రమంలో పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సి.ఐ లు, ఆర్.ఐ లు,ఎస్.ఐ లు, ఆర్.ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## దుర్గాదేవి మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్,అక్టోబర్ 21(వాయిస్ టుడే): నగరంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పలు దుర్గాదేవి మండపాలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.దుర్గాదేవి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, దేశం మరియు రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అశోక్ నగర్ లోని శ్రీ దుర్గా సేవా సమితి,టవర్ సర్కిల్లోని ఫ్రెండ్స్ అసోసియేషన్,కమాన్ వద్ద కమాన్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవార్లకు మరియు నగునూరు శ్రీ శ్రీ శ్రీ దుర్గా భవాని ఆలయంలో లోని దుర్గాదేవిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బండి సంజయ్ కుమార్,నగర మేయర్ కొలగాని శ్రీనివాస్,బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి,నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు,పలువురు బీజేపీ కార్పొరేటర్లు,నాయకులు భక్తులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి పరామర్శ

మానకొండూరు, అక్టోబర్ 21(వాయిస్ టుడే)::నియోజకవర్గం పరిధిలో జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో మృతిచెందిన ఇద్దరి కుటుంబాలను మానకొండూరు ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి అక్షయ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా,జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలోని పోస్టుమార్టం గదిలో ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. పోస్టుమార్టం ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం అక్షయ్ కుటుంబ సభ్యులను పరామర్శించి,వారిని ఓదార్చారు.అలాగే తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామానికి చెందిన గుంటుకు వీరప్రసాద్ గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆయన మృతదేహానికి పోస్టుమార్టం ప్రక్రియను త్వరగా పూర్తిచేసి బంధువులకు అప్పగించాలని సంబంధిత వైద్యులకు సూచించారు.




## జమ్మి అందించి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుకు దసరా శుభాకాంక్షలు

**అలాయ్ బలాయ్ కార్యక్రమంలో పాల్గొన్న గౌరారం కాంగ్రెస్ నాయకులు**

పిట్లం (వాయిస్ టుడే): కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావును దసరా పండుగ సందర్భంగా అలాయ్ బలాయ్ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి జమ్మి అందించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పండుగ సంతోషాలను పంచుకుంటూ సంప్రదాయబద్ధంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌరారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు శంకర్, నాయకులు మహేష్, నరేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# 18 నెలల్లో శ్రీవారి ఆలయ నిర్మాణం పూర్తి

**పద్మనగర్‌లో టీటీడీ ఆధ్వర్యంలో పనులు**

**నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ మంత్రి,ఎమ్మెల్యే గంగుల కమలాకర్**





కరీంనగర్,అక్టోబర్ 21(వాయిస్ టుడే): అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు కరీంనగర్ నగరంలోని పద్మనగర్‌లో ప్రారంభమయ్యాయి.తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ఆలయ నిర్మాణ పనులను మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నేడు పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించి పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించారు.చేపట్టనున్న పనులు ఏమిటి అనే అంశాలపై కాంట్రాక్టర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు.నిర్మాణం జరుగుతున్న తీరును నిశితంగా గమనించారు.ఆలయ నిర్మాణానికి సంబంధించిన వివిధ అంశాలపై కాంట్రాక్టర్లతో చర్చించారు.పనుల పురోగతి,నిర్మాణానికి పట్టే సమయం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ పనులు ప్రణాళిక ప్రకారం కొనసాగుతున్న తీరును పరిశీలించారు.నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను కాంట్రాక్టర్లు ఆయనకు వివరించారు. పద్మనగర్‌లో నిర్మిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణాన్ని మరో ఏడాదిన్నర కాలంలో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్లు గంగుల కమలాకర్‌కు వివరించారు.నిర్ణీత గడువులోగా ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసేలా పనులు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి బిఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్,మాజీ వైస్ ఎంపీపీ తిరుపతినాయక్,స్థానిక కార్పొరేటర్ గడ్డి ప్రదీప్,మాజీ కార్పొరేటర్లు వంగపల్లి రాజేందర్‌రావు,బోనాల శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ ఒళ్లాల మల్లేశం, దుర్శెడ్ మాజీ ఉపసర్పంచ్ శుంకిశాల సంపత్‌రావు,మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్,మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ,నాయకులు నూతి చందు,నూతి వెంకటేష్,కర్రె అనిల్, మంద రాజమల్లు,ఆరె రవిగౌడ్, ఆకుల కిరణ్,శ్రావణ్,దుర్గం మురళి పాల్గొన్నారు.



## తొర్రూరులో జమ్మి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూర్ అక్టోబర్ 21 (వాయిస్ టుడే) : దసరా పండుగను పురస్కరించుకుని తొర్రూరు పట్టణంలోని 1వ వార్డులో మరియు శ్రీ కృష్ణమందిరంలో నిర్వహించిన జమ్మి పూజ కార్యక్రమాల్లో పాలకుర్తి శాసనసభ్యురాలు శ్రీమతి మామిడాల యశస్విని రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించిన జమ్మి పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. దసరా పండుగ విజయానికి, శుభానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ, పాలకుర్తి నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సిరిసంపదలు వెల్లివిరియాలని, ప్రజలందరికీ విజయదశమి శుభాలను అందించాలని ఆకాంక్షించారు.



## పేర్ల ముకేశ్‌ను అభినందించి సన్మానించిన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళపల్లి హుస్సేన్

తొర్రూర్ అక్టోబర్ 21 (వాయిస్ టుడే) మహబూబాబాద్ జిల్లా స్థానిక మున్సిపల్ కేంద్రం సాయి నగర్ చెందిన పేర్ల దుర్గయ్య సమ్మక్క దంపతులకు జన్మించిన పుత్రుడు పేర్ల ముఖేష్ ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగం అయిన సీఐఎస్ఎఫ్ ఎయిర్పోర్ట్లో ఎస్సైగా ఉద్యోగం సంపాదించడం తొరూరు డివిజన్ కె కాకుండా జిల్లాకే గర్వకారణం అని డాక్టర్ మంగళపల్లి హుస్సేన్ అన్నారు. ఈరోజు ఉదయము హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఆధ్వర్యంలో నర్కుటి రామారాజు నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళపల్లి హుస్సేన్. పేర్ల ముఖేష్కు మిఠాయి తినిపించి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మంగళపల్లి హుస్సేన్ మాట్లాడుతూ. బేడ బుడగ జంగాలలో ఇలాంటి ఉద్యోగాలు మరిన్ని సాధించాలని వెనకబడ్డ వర్గాలలో చైతన్యం తీసుకురావాలని అన్ని రంగాలలో ముందు ఉండాలని యువతి యువకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్కుటి రామారాజు. రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం లాలయ్య. బిక్షము. తూర్పాటి సాయి. నర్కుటి వెంకన్న . పస్తం ప్రసాదు. అల్లంమస్తాన్.కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పోలీసు అమర వీరుల త్యాగాలు మరువలేనివి

**కలెక్టర్ చిత్రా మిశ్రా,పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**

కరీంనగర్,అక్టోబర్ 21(వాయిస్ టుడే): ప్రజల ప్రాణ,ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా,పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పేర్కొన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లోని అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం అడిషనల్ డీసీపీ వెంకటరమణ విధి నిర్వహణలో దేశవ్యాప్తంగా ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల నామావళిని చదివి వినిపించి గౌరవ వందనం సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు.జిల్లా యంత్రాంగానికి పోలీస్ శాఖ వెన్నెముక వంటిదని,శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నప్పుడే అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని పేర్కొన్నారు.అమరవీరుల కుటుంబాలకు,వారి పిల్లల విద్యాభివృద్ధి,సంక్షేమానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ దేశ సమగ్రత,అంతర్గత భద్రత,ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.అమరవీరుల త్యాగాలు ప్రతి పోలీస్ అధికారి,సిబ్బందికి స్ఫూర్తిదాయకమని,వారి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు అంకితభావంతో సేవలందించడమే వారికి అందించే నిజమైన నివాళి అని అన్నారు.అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం,పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని పేర్కొన్నారు.అనంతరం పోలీసు అమరవీరుల కుటుంబాల సమస్యలు అడిగి తెలుసుకున్నారు,ప్రభుత్వం వారికి అందాల్సిన నష్టపరిహారాలను పూర్తి స్థాయిలో అందేలా చూస్తామన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 21 నుంచి 31 వరకు కమిషనరేట్ పరిధిలో రక్తదాన శిబిరాలు,ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, వ్యాసరచన,లఘు చిత్రాల పోటీలువిద్యార్థులు,యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ వెంకటరమణ,ఏసీపీలు,పోలీస్ అధికారులు,సిబ్బంది,అమర వీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# పోలీస్ అమరవీరుల త్యాగం చిరస్మరణీయం.. వారి సేవలు పోలీస్ శాఖకు ఆదర్శం

**- జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్**





నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)అక్టోబర్ 21: నిర్మల్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈరోజు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ పోలీస్ అమరవీరుల స్మారక స్థూపం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... దేశ సరిహద్దుల్లో సైనికులు దేశాన్ని రక్షిస్తే, రాష్ట్రంలో అంతర్గత భద్రతను కాపాడుతూ ప్రజలకు భరోసా కల్పించేది పోలీసులని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల రక్షణలో పోలీసులు అహర్నిశలు విధులు నిర్వహిస్తున్నారని, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్ సరిహద్దులో చైనా సైనికులతో పోరాడుతూ ప్రాణాలర్పించిన సీఆర్పీఎఫ్ జవాన్ల త్యాగానికి గుర్తుగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి కుటుంబాలకు అండగా నిలవడం, వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వడం మనందరి బాధ్యత అని అన్నారు.

అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చి, జ్ఞాపికలను అందజేశారు. ఈ ఏడాది విధి నిర్వహణలో అమరులైన పోలీసుల పేర్లతో కూడిన రోల్ ఆఫ్ హానర్‌ను అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి చదివి వినిపించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది అమరవీరుల స్మారక స్థూపానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ తో పాటు అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్ నిర్మల్ డీఎస్పీ పి. శ్రీనివాస్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## నల్లజానమ్మ చరిత్ర పుస్తకంను ఆవిష్కరించిన మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్ అక్టోబర్ 21 వాయిస్ టుడే ప్రతినిధి: దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణ కేంద్రంలో వెలసిన శ్రీ నల్లజానమ్మ దేవాలయం దగ్గర తెలుగు రిటైర్డ్ ఉపాధ్యాయుడు బాలస్వామి రచించిన నల్ల జానమ్మ చరిత్ర పుస్తకం ను మంత్రి వాకిటి శ్రీహరి వారి సతీమణి వాకిటి లలితతో కలిసి నల్లజనమ్మ ఆలయ ప్రాంగణంలో నల్ల జానమ్మ అమ్మవారి యొక్క చరిత్ర పుస్తకం ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత బాలస్వామిని మంత్రి వాకిటి శ్రీహరి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పుస్తక దాతలు భారతీయ విద్యా నికేతన్ కరస్పాండెంట్ నాగిరెడ్డి, కృష్ణవేణి టాలెంటెడ్ స్కూల్ కరస్పాండెంట్ తిరుపతి రెడ్డి రేడియంట్ పాఠశాల, మరియు స్కాలర్స్ కాలేజ్ కరస్పాండెంట్ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మనసా హనుమంతు, కౌన్సిలర్ అలుకు పావని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఏ రవికుమార్, ఇట్టి కార్యక్రమాన్ని తన భుజస్కందాలపై వేసుకొని విజయవంతంగా నిర్వహించిన మీ అంబదాస్ రావు కాంగ్రెస్ నాయకులు గణేష్, కావాలి తాయప్ప, ఆలయ పూజారి సభ్యులు బి అశోక్, నాగేందర్, దేవా రెడ్డి నరసింహారెడ్డి, పాల్గొన్నారు



## భైంసాలో నిమజ్జనోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 21: భైంసా పట్టణంలోని పురాణబజార్, భవానీ చౌక్ వద్ద నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన హారతి కార్యక్రమంలో ముధోల్ శాసనసభ్యులు శ్రీ పవార్ రామారావు పటేల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనోత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. విద్యుత్, మున్సిపల్, పోలీస్ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిమజ్జనోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కోరారు. ప్రజలందరూ శాంతియుతంగా ఉత్సవాల్లో పాల్గొని అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ మున్సిపల్ చైర్మన్ దత్తు దుర్గామాత స్వాములు కార్యకర్తలు పాల్గొన్నారు.



## హెడ్ కానిస్టేబుల్ గడపలే బాబు మృతి పోలీస్ శాఖకు తీరని లోటు

**అంత్యక్రియల్లో పాల్గొన్న ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్**

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 21: నిర్మల్ జిల్లా పోలీస్ శాఖలో విషాదం నెలకొంది. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గడపలే బాబు (HC 2228), విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో గత రాత్రి భైంసా పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందారు. ఆయన మృతి పట్ల పోలీస్ అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. హెడ్ కానిస్టేబుల్ గడపలే బాబు స్వగ్రామమైన నిర్మల్ జిల్లా తానూర్ మండలం బెంబేరా గ్రామంలో నేడు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ హాజరై, ఆయన పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారితో మాట్లాడి వారి బాధను పంచుకున్నారు. ఈ క్లిష్ట సమయంలో వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, పోలీస్ శాఖ కుటుంబానికి అండగా ఉంటుందని, అవసరమైన సహకారం అందిస్తుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, హెడ్ కానిస్టేబుల్ గడపలే బాబు మృతి పోలీస్ శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఆయన అందించిన సేవలు గుర్తుండిపోతాయని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ ఎస్. సాయికిరణ్, ఐపీఎస్ ముధోల్ సీఐ రవీందర్ నాయక్, తానూర్ ఎస్ఐ షేక్ జుబేర్ ఖాన్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దండేకర్ సాయికుమార్, పోలీస్ సిబ్బంది, బంధుమిత్రులు తదితరులు పాల్గొని గడపలే బాబుకు నివాళులర్పించారు.



## దేవి నవరాత్రులు ఉత్సవాలు ఉత్సవాలలో పాల్గొన్న సాదుల నగర్ సర్పంచ్ లక్ష్మి కృష్ణ భవాని

**భక్తులు గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు**

నర్సాపూర్ (వాయిస్ టుడే) : సాదుల నగర్ గ్రామంలో బుధవారం నాడు దుర్గాభవాని మాత ఉత్సవాలకు భక్తులు గ్రామ ప్రజలు అమ్మవారి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి భవాని మాతను దర్శించుకున్నారు ఈ సందర్భంగా సాదుల నగర్ సర్పంచ్ లక్ష్మి కృష్ణ మాట్లాడుతూ భవాని మాత అమ్మవారు గ్రామ ప్రజలను సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉంచాలని భవాని మాతను వేడుకున్నారు భవాని మాతఅమ్మవారు నేటికీ 11 రోజు కావడంతో అమ్మవారి శివసత్తులు ఆటపాటలతో అమ్మవారి భవాని మాత భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆటపాటలతో శివసతులతో చిందులేస్తూ అమ్మవారిని ఊరేగింపు చేశారు అనంతరం అమ్మవారిని నిమజ్జనం చేశారు కార్యక్రమంలో భవాని భక్తులు గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థికి శుభాకాంక్షలు తెలియజేసిన ముధోల్ మాజీ శాసనసభ్యులు శ్రీ జి. విఠల్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 21: కుబీర్ మండలంలోని పార్డి బి గ్రామానికి చెందిన గౌరవ మాజీ సర్పంచ్ కండెల రాజన్న గారి మనుమరాలు గౌరవ కండెల శివాని D/o గౌరవ సునీల్ ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీటు సాధించడం జరిగింది. వారికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించిన మాజీ శాసనసభ్యులు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బెల్లల గంగాధర్, ఏరేకర్ మిలింద్ మరియు పాల్గొన్నారు.



## భైంసాలో దుర్గమ్మ హారతిలో పాల్గొన్న ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 21: వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన హారతి కార్యక్రమంలో ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న దుర్గామాత నిమజ్జన వేడుకల్లో భాగంగా ఆయన భక్తిశ్రద్ధలతో హారతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని, దుర్గమ్మ ప్రజలందరినీ చల్లగా చూడాలని, ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండేలా ఆశీర్వదించాలని అమ్మవారిని వేడుకున్నారు.రైతులకు మంచి పంటలు పండి, ప్రజలకు ఎలాంటి కష్టాలు రాకుండా జీవించాలని, దుర్గమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## అమ్మ నాన్న మరణించి అనాధగా మారిన నిరుపేద

**11 సం..రాల "కనికరం అవలిక" కు మా అమ్మ నాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 15000 వేయిల రూపాయలు, 50కిలోల సన్న బియ్యం, నిత్యవసర సరకుల అందజేత**



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 21 : నిర్మల్ జిల్లా భైంసా పట్టణం బట్టి గల్లీకి చెందిన కనికరం సాయినాథ్ ఆరు సంవత్సరాల క్రితం చనిపోయారు అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతూ మూడు రోజుల క్రితం అవలిక తల్లి గారైన గంగామణి చనిపోవడం జరిగింది వారిద్దరు మరణించడంతో అనాధగా మారిన అవలిక తన తల్లి అంత్యక్రియలు చేయడానికి డబ్బులు లేక బాధపడుతున్న విషయం తెలుసుకున్న మా అమ్మానాన్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆంజనేయులు గారు ఆ అమ్మాయికి మనసున్న దాతలుసహాయం అందజేయమని సామాజిక మాధ్యమాలలో కోరడం జరిగింది. దానికి స్పందించిన దాతలు ఆదిలాబాద్, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, నిర్మల్, బాసర్, లోకేశ్వరం, తదితర ప్రాంతాల నుంచి వారికి తోచిన విధంగా దాదాపు ? 14, 664 రూపాయలు పంపడం జరిగింది. అదేవిధంగా మా అమ్మ నాన్న ఫౌండేషన్ తరపున 50 కిలోల సన్న బియ్యం నిత్యవసర సరుకులు, కొద్ది మొత్తాన్ని కలిపి ఆ చిన్నారికి ఈరోజు వారి దగ్గర బందుల కాలనీవాసుల సమక్షంలో ? 15000 రూపాయల చెక్కును అందజేయడం జరిగింది.ఇట్టి దీనగాథ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా స్పందించి సహాయం అందించిన ప్రతిఒక్క ధాతకు పేరుపేరునా పాదాలకు నమస్కరిస్తున్నాను ఈ కార్యక్రమంలో మా అమ్మ నాన్న ఫౌండేషన్ చైర్మన్ యం ఆంజనేయులు, బీసీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు శ్రీ సుంకేట పోశెట్టి , మా అమ్మానాన్న ఫౌండేషన్ డైరెక్టర్ శ్రీ ఎస్. ప్రకాష్ మునీరోద్దీన్ ముత్తన్న తదితరులు పాల్గొన్నారు.



## బుధవార్ పేట్‌లో ఘనంగా జరిగిన 70వ దమ్మచక్ర పరివర్తన దినోత్సవం

**అంబేద్కర్ విగ్రహా నిర్మాణానికి భూమి పూజ**

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) అక్టోబర్ 21: నిర్మల్ జిల్లా కేంద్రంలోని బుధవార్ పేట్ లో గల మాల సంక్షేమ సంఘ భవనం వద్ద మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 70వ దమ్మచక్ర పరివర్తన దినోత్సవం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహా ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం బుధవార్ పేట్ వార్డ్ అధ్యక్షులు ఏలుమల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి పేరుమల్ల రాజేశ్వర్, మాజీ అధ్యక్షులు డి లక్ష్మణ్, ఎల్మల ముత్తన్న, ఎర్ర రవి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

**టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కుందూరు దేవేందర్ రెడ్డి**

**సూర్యాపేట ను కరువు జిల్లాగా ప్రకటించాలి**

సూర్యాపేట జిల్లా (వాయిస్ టుడే) ప్రతినిధి: ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల శాసన మండలి అభ్యర్థిగా డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ ను తొలిసారిగా బరిలో నిలుపుతున్నామని పట్టబద్రులు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూర్యాపేట జిల్లా తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా అధ్యక్షులు కుందూరు దేవేందర్ రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని ఎస్వికే గ్రాండ్ హోటల్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా టిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకులు కవిత ఆదేశాల మేరకు పాంచ జన్య అంశాలతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కరువు జిల్లాగా సూర్యాపేట జిల్లా ను ప్రకటించి ఎండిపోయిన పంటలకు ఎకరానికి 50, వేల రూపాయలు నష్టపరిహారం అందించి, విద్యుత్ కోతలను నివారించి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**